18-8P g7exHMNWJQE:18-8P g7exHMNWJQE.qxd 8/17/2026 11:48 PM Page 1



# క్వాంటం కంప్యూటింగ్‌లో ఎపి విద్యార్థులకు 4 గోల్డ్, 14 సిల్వర్ మెడల్స్

## విజేతలను అభినందించిన సిఎం చంద్రబాబు



**విజయవాడ, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** క్వాంటం కంప్యూటింగ్‌లో నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ టెక్నాలజీ ఎన్హాన్స్‌డ్ లెర్నింగ్ నిర్వహించిన పరీక్షలో ఎపి విద్యార్థులు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. ఐఐటీ, ఐఐఎస్సీలు సంయుక్తంగా చేపట్టిన ఎన్‌పిటిఇఎల్ ద్వారా క్వాంటం అల్గారిథమ్స్ అండ్ క్విస్కిట్‌లో ఎపికి చెందిన విద్యార్థుల నైపుణ్యం ప్రదర్శించారు. ఐఐటి మద్రాస్, ఐబిఎం సంస్థల నిపుణుల సారథ్యంలో 4 వారాల కోర్సులో ఎపి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపించారు.. దేశవ్యాప్తంగా దరఖాస్తు చేసి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన వారిలో ఒక్క ఎపి నుంచే 50శాతం మంది ఉన్నారు. ఎన్‌పిటిఇఎల్ కోర్సుకు ఎపి నుంచే 1,04,220 దరఖాస్తులు దాఖలయ్యాయి. దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి 1,04,565 దరఖాస్తులు పంపారు. ఎపి నుంచి 19 వేల మంది పరీక్షకు హాజరైతే దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి 11 వేల మంది హాజరు అయ్యారు. ఈ పరీక్షలో ఒక్క ఎపి నుంచే 2839 మంది ఉత్తీర్ణత, దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాల నుంచి 2700 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ఎపి విద్యార్థులకే 4 గోల్డ్ మెడల్స్, 14, సిల్వర్ మెడల్స్, దేశంలోని ఇతర ప్రాంతాల వారికి 4 గోల్డ్, 16 సిల్వర్ మెడల్స్. 14 సిల్వర్ మెడల్స్‌లో అత్యధికంగా 7 మెడల్స్ సాధించిన వారిలో ఆర్జీకేయూటీ నూజివీడు విద్యార్థులు ఉన్నారు. బీటెక్ విద్యార్థులు విశాఖకు చెందిన సీహెచ్ రామ సౌజన్య, విజయవాడకు చెందిన టి. సౌమ్య శ్రీ, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన అనిల్ శ్రీనివాస్, రాజమహేంద్రవరానికి చెందిన యశ్వంత్‌లకు గోల్డ్ మెడల్స్ లభించాయి.

ఐఐటీ మద్రాస్, ఐబీఎం రీసెర్చ్ లు నిర్వహించిన క్వాంటం స్కిల్ కోర్సుకు ఏపీ నుంచి ఎక్కువ దరఖాస్తులు రావటంపై గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేసారు. ఏపీలో 1 లక్ష మంది క్వాంటం నిపుణుల్ని తయారు చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు సీఎం పేర్కొన్నారు. ఈ పరీక్షలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ విజేతలను కలిసి అభినందించడానికి సిద్ధంగా ఉన్నానంటూ గతంలో ట్వీట్ చేసిన ముఖ్యమంత్రి. ఐబీఎం, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, టీసీఎస్, ఇన్ఫోసిస్, గూగుల్ లాంటి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా క్వాంటం కంప్యూటింగ్ కోర్స్ మెడల్స్ సాధించిన వారిలో ఇప్పటికే ఆరుగురికి క్వాంటం కంప్యూటింగ్ సంస్థల్లో ఉద్యోగాలు. మేధా టవర్స్‌లోని క్వాంటం కంప్యూటింగ్ సంస్థలో ఉద్యోగాలు దక్కించుకున్న ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం వీరంతా సీఎం చంద్రబాబును ఏపీ సచివాలయం కలిసారు. వారిని సీఎం అభినందించారు.

# సరిహద్దులు లేని వ్యవసాయ సాంకేతికతపై అంతర్జాతీయ సదస్సు



**తిరుపతి, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో 'సరిహద్దులు లేని వ్యవసాయ సాంకేతికత్ల పై అంతర్జాతీయ విద్యార్థి మొబిలిటీ కార్యక్రమం జరిగింది. ఎస్పీఎంవీవీ అంతర్జాతీయ సంబంధాల కేంద్రం హోమ్ సైన్స్ విభాగం, మలేషియాలోని యూనివర్సిటీ మలేషియా తెరెంగానూ సంయుక్తంగా నిర్వహించాయి. అంతర్జాతీయ విద్యా సహకారాన్ని ప్రోత్సహించడం, విద్యార్థుల మొబిలిటీ కార్యక్రమాలకు అవకాశాలు కల్పించడం, జ్ఞాన మార్పిడి వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశాలు. ఆచార్య ఎన్.రజని, హోమ్ సైన్స్ విభాగాధిపతి కార్యక్రమ సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీ మలేషియా తెరెంగానూకు చెందిన 19మంది విద్యార్థులు వర్సిటీలో పాల్గొంటున్నారని ఆమె తెలిపారు. అంతర్జాతీయ విద్యా అనుభవం, పరస్పర సహకారంతో కూడిన అభ్యసనం విద్యార్థుల జ్ఞానాన్ని విస్తరించడంతో పాటు వ్యవసాయం అనుబంధ రంగాల్లో అభివృద్ధి చెందుతున్న అంశాలపై అవగాహన పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సి.వాణి, ఆచార్య పి. విజయలక్ష్మి ్ర, ఆచార్యులు పాల్గొన్నారు.

# జననం.. మరణం మధ్యలో ఓ ధ్రువపత్రం

## • సర్టిఫికెట్లకు వేలల్లో వసూళ్లు • అవగాహన లేకపోవడమే కారణం

**ఒంగోలు, ఆగస్టు 17 ప్రభాతవార్త:** ఒంగోలు నగరానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందగా మధ్యవర్తి ద్వారా రూ.5వేలు చెల్లించి మరణ ధ్రువీకరణ పత్రం తీసుకున్నారు. కాలనీకి చెందిన మరో వ్యక్తి బంధువు కుమారుడి జనన ధ్రువీకరణ పత్రంలో తప్పులు సరిచేసేందుకు సిబ్బంది వేయి రూపాయలు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఏ పని జరగాలన్నా జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. పథకాలు, బీమా, విదేశీ ప్రయాణాలు ఇతర దరఖాస్తులకు విధిగా జతచేయాల్సి ఉంటుంది. ఇంట్లో సభ్యులు మరణిస్తే వారి పేరిట లబ్ధి కలగాలంటే డెత్ సర్టిఫికెట్ కూడా ఉండాలి. ఇలా ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని కొందరు అధికారులు, సిబ్బంది నిలువునా దోచేస్తున్నారు. అవగాహన లేకపోవడంతో దళారులను ఆశ్రయిస్తూ వినియోగదారులు నష్టపోతున్నారు. ఒంగోలు నగరపాలకలో ఈతంతు యథేచ్ఛగా సాగుతుంది. జిల్లాలో అత్యధికంగా నగరంలో బర్త్ సర్టిఫికెట్‌లు 300లకు పైగా, మరణ ధ్రువీకరణ పత్రాలు 150 నుంచి 200ల వరకు జారీ చేస్తున్నారు. వీరిలో 70శాతం మంది మధ్యవర్తుల ద్వారానే వెళ్తున్నారు. మారిన నిబంధనలు, ఫీజులు గడువు, ఫారాలు పొందడం నింపడంపై అవగాహన లేక వినియోగదారులు భారీగా నగదు చెల్లిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. బిడ్డ పుట్టిన 21 రోజుల్లోపు నగరపాలికకు సమాచారం ఇవ్వాలి. ఆ గడువు దాటితే రూ.25లు చలానా కట్టాలి. ఏడాది లోపు అయితే రూ.250లు చలానాలను జిల్లా రిజిస్ట్రర్ గణాంకాల పేరిట ఇవ్వాలి. 12 నెలల లోపు శిశువుకు పేరు పెడితే ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. 12 నెలల తరువాత 15ఏళ్ల లోపు అయితే రూ.250 కట్టాలి. రికార్డులు వెతకడానికి, సింగిల్ ఎంట్రీ ఫీజు కింద అదనంగా రూ.50లు తీసుకుంటారు. అదనపు సంవత్సరాలకు ఏడాదికి రూ.25లు చొప్పున కట్టాలి. అదనపు ధ్రువపత్రానికి రూ.50 చెల్లించాలి. ఆలస్యమైతే ఆర్డీవోతో పొందేందుకు రూ.500లతో నోటరీ చేయించాలి. జనన మరణ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో పొందకుంటే ఆర్డీవో స్థాయి అధికారి ద్వారా నాన్‌అవెలబులిటి పత్రం పొందాలి. ఈ మేరకు పాత రికార్డులు వెతకడానికి, పాఠశాలలో ఉన్నట్లు పేరు వచ్చేలా చేసేందుకు అదనపు కాపీల కోసం ఇలా పలు రకాల పనులపై ప్రజలు సచివాలయాలు, నగర పాలక సంస్థ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. వారికి సరైన సమాచారం ఇచ్చేవారు ఉండటం లేదు. కొందరు బయట వ్యక్తులు తిష్ట వేసి పలువురు సిబ్బంది సహకారంతో నగదు అడుగుతున్నారు. ఒక వేళ నేరుగా పద్ధతి ప్రకారం వెళ్తే తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది. నగదు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయాలని, 21 రోజుల లోపు రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఇబ్బంది ఉండదని, ప్రజారోగ్య అధికారి, నగర పాలక సంస్థ అధికారులు చెప్తున్నారు. ఇవి వారు చెప్పిన మాటలకు, ఇక్కడ జరుగుతున్న దానికి పొంతన లేదని నగర వాసులు వాపోతున్నారు.





## అమెరికా నుంచి స్వగ్రామానికి దిలీప్ మృతదేహం

**చిట్వేలి(తిరుపతి జిల్లా), ఆగస్టు 17 ప్రభాతవార్త:** 'దేవుడా మేము ఏమి పాపం చేసాము. మా కన్న కొడుకుని దూరం చేశావ్ఙ అంటూ బుంగటావుల దిలీప్ కుమార్ తల్లిదండ్రుల శ్రీహరి, చాముండి, కుటుంబ సభ్యుల కన్నీటి ఆర్తనాదాలు తిరుపతి జిల్లా చిట్వేలి మండల పరిధిలోని జట్టువారిపల్లి గ్రామాన్ని నిర్ఘాంత పరిచాయి. '27 సంవత్సరాలకే నీకు నూరేళ్లు నిండాయా తండ్ఙ్రి అంటూ కుటుంబీకులు, బంధువులు, స్థానికులు బోరున విలపించారు. ఆగస్టు 7న అమెరికా కెంట్ నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దిలీప్ కుమార్ మరణించగా పది రోజుల నుంచి తన కుమారుడి మరణ వార్తతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పడ్డ ఆవేదన, రోదన నివారించడం ఎవరితరం కాలేదు. మృతదేహం కోసం బరువైన గుండెతో ఎదురుచూశారు. కాగా దిలీప్ కుమార్ మృతదేహం అమెరికా నుంచి సోమవారం మద్రాసుకు చేరుకుంది. స్వగ్రామం జట్టువారిపల్లెలో సోమవారం ఉదయం అంత్యక్రియలు కుటుంబ సభ్యులు నిర్వహించారు. నాయకులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు త్వరితగతిన పరిష్కారం



**తిరుపతి, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సిఎండ్ఙి కార్యక్రమానికి 57వినతులు అందాయి. 9 జిల్లాల నుండి 57మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చినట్లు సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు, విద్యుత్ స్తంభాల మార్పు, వోల్టేజ్ సమస్యలు తదితర అంశాలపై ఈ కార్యక్రమం ద్వారా తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుగా అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్.శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్ర రావు, కె.సంపత్ కుమార్, జనరల్ మేనేజర్లు సుబ్బారావు, శ్రీకాంత్, చక్రపాణి, జగదీష్, హేమలత, లత, పిఆర్‌ఒ మధుసూదన పాల్గొన్నారు.

## భూమన అవినీతి చరిత్ర పై గ్రంథం రాయొచ్చు



**తిరుపతి, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌లను నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి ఒళ్ళు దగ్గర పెట్టుకోవాలని టిడిపి తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జెబి శ్రీనివాస్ హెచ్చరించారు. భూమన మొదటిసారి టిటిడి చైర్మన్ అయినప్పుడు వైకుంఠం క్యూ కంప్లెక్స్‌లో భక్తుల కోసం ఏర్పాటు చేసిన ప్లాస్మా టివిలను సైతం దొంగతనం చేసిన చరిత్ర అని ఆరోపించారు. గంజాయి, గుట్కా, టిడిఆర్ బాండ్లు, ఇలా చెప్పుకుంటే పోతే భూమన అవినీతి చరిత్ర గురించి ఓ గ్రంథం రాయొచ్చని, ఓ సినిమా తీయవచ్చని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## కరుణాకర్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి



**తిరుపతి(హెల్త్), ఆగస్టు 17 ప్రభాతవార్త:** సమాజంలో వారు చేసే పని వృత్తులను బట్టి కులాలు ఏర్పడ్డాయని, పెత్తందారీ పోకడలతో ఉండే కులాలు గ్రామాలలో బడుగు బలహీన వర్గాలను హీనంగా చూస్తున్నారని, బడుగు బలహీన వర్గాల నుండి చదువుకొని ఉన్నత స్థాయిలో ఉంటే జీర్ణించుకోలేవా? కరుణాకర్ రెడ్డి అని రాష్ట్ర నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇనుకొండ సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా ప్రథమ పౌరుడు అయిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను డాకు మంగల్ సింగ్‌తో పోల్చడం సిగ్గుచేటని, డాకు అనే పదం కలెక్టర్ కన్నా మీకే బాగా సెట్ అవుతుందన్నారు. ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తిరుపతి నగర నాయి బ్రాహ్మణ ప్రధాన కార్యదర్శి దాము, కోశాధికారి ఉప్పలపాటి శివయ్య, కలికిరి ముని ప్రతాప్, రెడ్డప్ప, రూపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## గరుడ పంచమిన గరుడసేవ

**తిరుమల, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో గరుడపంచమి పర్వదినాన సోమవారం రాత్రి గరుడ సేవ అత్యంత వైభవంగా జరిగింది. ఈ పవిత్ర వేడుకలో శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సర్వాంగ సుందరంగా ముస్తాబైన మలయప్పస్వామి గరుడ వాహనంపై కొలువుదీరారు. భక్తకోటికి దివ్య దర్శనం ఇచ్చారు. దివ్యాభరణాలు ధరించిన మలయప్పస్వామి జగన్మోహన రూపంలో గరుడ వాహనంపై అధిష్ఠించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. 108 వైష్ణవ దివ్య దేశాలలో గరుడ వాహన సేవకు ఎంతో పవిత్రమైన స్థానం ఉంది. శ్రీమహావిష్ణువు పరమ భక్తుడు, వాహనమైన గరుడుడు వేద స్వరూపానికి, ఆధ్యాత్మిక జ్ఞానానికి వైరాగ్యానికి ప్రతీక. తనను సంపూర్ణ విశ్వాసంతో శరణు కోరిన భక్తులకు భగవంతుడు అందించే అపారమైన అనుగ్రహానికి ఈ సేవ నిదర్శనమని పండితులు చెబుతుంటారు. ఈ వాహనసేవలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

## 30 నుండి కారీరిష్టి యాగం పర్జన్యశాంతి హోమం

**తిరుమల, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని సకాలంలో వర్షాలు కురవాలని ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తూ ఈనెల 30 నుండి సెప్టెంబర్ 3వ తేదీ వరకు కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్యశాంతి హోమాలను టిటిడి నిర్వహించనుంది. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 32 మంది వేద, శ్రౌత, స్మార్థపండితులు యాగ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సెప్టెంబర్ 3న మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## పుష్కరిణిలో అదనపు గ్రిల్స్ ఏర్పాటు

### • మరమ్మతు పనుల తనిఖీల్లో అదనపు ఇఒ చౌదరి

**తిరుమల, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి పుష్కరిణీలో భక్తులకు అసౌకర్యం కలగకుండా, ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టంగా గ్రిల్స్ ఏర్పాటు చేయాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులకు సూచించారు. అదేవిధంగా పుష్కరిణీ లోతు తెలిసేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని చెప్పారు. సోమవారం మధ్యాహ్నం తిరుమలలో జరుగుతున్న స్వామివారి పుష్కరిణి మరమ్మతు పనులను అదనపు ఇఒ తనిఖీ చేశారు. సెప్టెంబర్ 15 నుండి 23వ తేది వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో శ్రీవారి పుష్కరిణీ మరమ్మతు పనులు జరుగుతున్న విషయం విదితమే. ఈ సందర్భంగా అదనపు ఇఒ వెంకయ్య చౌదరి స్వయంగా పుష్కరిణీని తనిఖీ చేశారు. పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో ఎస్ఇ వేణుగోపాల్, డిప్యూటీ ఇఒ భాస్కర్, ఇఇలుసుధాకర్, శ్రీనివాసరావు, డిఇ చంద్ర శేఖర్, విఎస్ఒ సురేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కులమత భేదాలకు అతీతంగా అందరికీ భగవంతుని సేవాభాగ్యం

## • రామానుజాచార్యుల సంకల్పంతోనే అమలు • మఠాధిపతులు, పీఠాధిపతులు



**తిరుమల, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** కులమత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ భగవంతుని సేవలో భాగస్వామ్యం కల్పించిన మహోన్నత ఆచార్యులు రామానుజాచార్యులని పీఠాధిపతులు, మఠాధిపతులు పేర్కొన్నారు. కలియుగవైకుంఠం తిరుమలలో నాలుగు మాడ వీధులను ఏర్పాటు చేసి, శ్రీవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన వ్యవస్థను బలోపేతం చేశారని ఈ సందర్భంగా తెలిపారు. తిరుమలేశుని ఆలయంలో జరిగే నిత్య కైంకర్యాలకు రామానుజాచార్యుల విధానాలే పునాది అని అన్నారు. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో టిటిడి ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో "శ్రీవైష్ణవ ఆచార్యుల ఆధ్యాత్మిక సేవలు" అనే అంశంపై జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ సదస్సు కొనసాగనుంది. తిరుమల పెద్ద జీయర్ స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి అనుగ్రహభాషణం చేశారు. తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో భగవద్ రామానుజాచార్యులు నిర్దేశించిన కైంకర్య విధానాలు నేటికీ సక్రమంగా కొనసాగుతున్నాయని తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని నిత్య కైంకర్యాలతో పాటు గోవిందరాజస్వామివారి ఆలయం, ఇతర దివ్యదేశాల్లో రామానుజాచార్యులు ఏర్పాటు చేసిన కైంకర్య వ్యవస్థ నేటికీ కొనసాగుతోందని పేర్కొన్నారు. చిన్నజీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ, రామానుజాచార్యులు సాక్షాత్తు ఆదిశేషుని అవతారమని, శ్రీవారికి నిత్య కైంకర్యాలను వ్యవస్థీకృతం చేసిన మహనీయుడని తెలిపారు. శ్రీవారికి శుక్రవారం అభిషేకాన్ని ప్రవేశపెట్టడంతోపాటు శంఖచక్రాల ప్రతిష్ఠను నిర్వహించారని చెప్పారు. తిరుమలలో నిర్వహించే ప్రతి సేవలో ఆళ్వార్ల పాశురాలు ఉండేలా ప్రత్యేక విధానాన్ని అమలు చేశారని తెలిపారు. రామానుజాచార్యుల మేనమామ తిరుమల నంబి శ్రీవారికి నిత్య కైంకర్యాలు నిర్వహించగా, అనంతాళ్వారు పుష్ప కైంకర్యంలో విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. ఆళ్వార్లు, ఆచార్యులు అందించిన సేవలు శ్రీవారి కైంకర్య సంప్రదాయ పరిరక్షణకు ఎంతో దోహదపడ్డాయన్నారు. ఆళ్వార్ ప్రాజెక్టు విశ్రాంత ప్రత్యేకాధికారి డాక్టర్ మాడభూషి వరదరాజన్ మాట్లాడుతూ ఆచార్య పుండరీకాక్షులు శ్రీమన్నాథమునుల శిష్యపరంపరలో ప్రముఖులని తెలిపారు. ఆళ్వారుల నాలాయిర దివ్యప్రబంధ పారాయణాన్ని దేవాలయాల్లో వ్యవస్థీకృతంగా నిర్వహించే సంప్రదాయాన్ని వైష్ణవ దివ్యదేశాల్లో విస్తరించారని చెప్పారు. పుండరీకాక్షులు నెలకొల్పిన ఈ పారాయణ సంప్రదాయం నేటికీ కొనసాగుతోందని, వారి ఆధ్యాత్మిక సేవలు శ్రీవైష్ణవ సంప్రదాయ పరిరక్షణకు మార్గదర్శకంగా నిలిచాయని తెలిపారు.

భగవద్ రామానుజులు, శ్రీ గోవింద భట్టర్ (ఎంబార్) తిరుప్పుట్కుళి గురుకులంలో సహాధ్యాయులుగా విద్యాభ్యాసం చేశారని తెలిపారు. దాశరథి (ముదళియాండాన్) శ్రీరంగం దేవస్థాన నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ శ్రీవైష్ణవ సంప్రదాయ పరిరక్షణకు విశేష సేవలందించారని వివరించారు. హైదరాబాద్‌కు చెందిన పరాకాలన్ స్వామి నాథముని- పుండరీకాక్షుల ఆధ్యాత్మిక సేవలు" అనే అంశంపై ప్రసంగించారు. ఆళ్వార్ల నాలుగు వేల పాశురాలను సేకరించి "నాలాయిర దివ్యప్రబంధం"గా క్రోడీకరించి భక్తి సాహిత్యానికి విశిష్ట సేవలందించారని చెప్పారు. రాఘవన్ స్వామి, తిరువల్లిక్కేని శ్రీనివాసన్ స్వామి, చెన్నైకి చెందిన రంగరాజన్, మాధవన్ స్వామి వైష్ణవ ఆచార్యుల ఆధ్యాత్మిక సేవలు, శ్రీవారి కైంకర్య సంప్రదా యాలు, విశిష్టాద్వైత తత్వం, ఆళ్వార్ల పాశురాల ప్రాధాన్యంపై ప్రసంగిం చారు. పలువురు పండితులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి తిరుమళిశై ఆళ్వార్, పండితులు, పరిశోధకులు పాల్గొన్నారు.



మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వేదాశ్వీరచనం చేస్తున్న వేదపండితులు, అర్చకులు, చిత్రంలో ఆలయ ఇఒ వికె శీనానాయక్

# వేగంగా దుర్గమ్మ ఆలయ అభివృద్ధి పనులు

## •దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 17 ప్రభాతవార్త:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సోమవారం ఉదయం విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం కార్యనిర్వహణాధికారి వికె శీనానాయక్ మర్యాదపూర్వకంగా కలిసి ఆలయం అభివృద్ధి పనులు వివరించారు. దేవస్థానం స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వేద పండితులు, అర్చకులు మంత్రి'కి శ్రీ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి ఆశీస్సులు అందించారు. భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, సామాన్య భక్తునికి జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారి సత్వర దర్శనం అయ్యేలా చూడాలని, ప్రణాళికాబద్ధంగా దసరా ఏర్పాట్లు ఉండాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశించినట్లు ఇఒ శీనా నాయక్ తెలిపారు.

# తిరుమలలో మళ్లీ రీల్స్ వివాదం

## • దేవుని పేరుతో చేయడంతో విమర్శలు

**తిరుమల, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల పుణ్యక్షేత్రంలో సోమవారం మళ్ళీ ఓ జంట రీల్స్ చేయడం వివాదంగా మారింది. దేవుని పేరుతో ఇద్దరూ సర్వదర్శనం క్యూలైన్ వద్ద, రాంభగీచా విశ్రాంతి గృహాల ముందు ఇలా చేయడంతో భక్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. తిరుమల కొండపై రీల్స్, వీడియోల నిబంధనల ఉల్లంఘనపై పలుమార్లు తీవ్ర ఆందోళన వ్యక్తమైన విషయం విదితమే. సామాజిక మాధ్యమాల కోసం రీల్స్ చేయడం, కేక్ కటింగ్స్ నిబంధనలకు విరుద్ధంగా వీడియోలు తీయడంపై భక్తుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీనిపై టిటిడి కూడా చట్టపరంగా చర్యలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో మరోసారి తిరుమలలో సోమవారం ఓ జంట దేవుని పేరుతో రీల్స్ చేయడం సంచలనంగా మారింది. శ్రీవారి దర్శనార్థం వెళ్తున్న సమయంలో సర్వ దర్శనం క్యూలైన్ వద్ద రీల్స్ చేసిన ఆ కుటుంబాన్ని నెటిజన్లు విమర్శిస్తున్నారు. కొంతమంది పబ్లిసిటీ కోసం కావాలనే వార్తల్లోకి ఎక్కడానికి రీల్స్ చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై టిటిడి విజిలెన్స్, తిరుమల పోలీసులు ఆరా తీస్తున్నారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా రీల్స్, షార్ట్స్ చేసే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టిటిడి మరోమారు స్పష్టం చేసింది.



# నడకమార్గంలో ధూమపానం నిందితుడు అరెస్ట్

**తిరుమల, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** అలిపిరి తిరుమల నడక మార్గంలో బీడీ తాగుతూ సామాజిక మాధ్యమంలో కనిపించిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. తెలంగాణ నల్గొండ జిల్లా దామరచర్ల మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన పొదిలా నాగరాజు (29)గా తేల్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించేది లేదని పోలీసులు తెలిపారు. నిబంధనల ఉల్లంఘనతో పాటు పవిత్ర క్షేత్రానికి వచ్చే భక్తుల మనోభావాలను దెబ్బతీసే చర్యగా పోలీసులు పేర్కొన్నారు.

# తిరుమలలో గదుల దళారీ ముఠా గుట్టురట్టు

**తిరుమల, ఆగస్టు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో సిఆర్ఒ కార్యాలయం వద్ద నకిలీ గుర్తింపు పత్రాలతో వేరొకరి పేర్లతో గదులు పొంది వాటిని అధిక ధరలకు భక్తులకు విక్రయిస్తున్న దళారీ ముఠా ప్రయత్నాన్ని టిటిడి విజిలెన్స్ విభాగం భగ్నం చేసింది. ఈనెల 16న అప్పటికే ఒక గది పొందిన వ్యక్తి మరో గుర్తింపుతో తిరిగి గది కోసం క్యూలో నిలబడటాన్ని సిఆర్ఒ కార్యాలయం సిబ్బంది గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడిని కేరళ మలప్పురం జిల్లాకు చెందిన ఆషిక్ అలీ పి.ఎం. (32)గా గుర్తించారు. అతని వద్ద రెండు నకిలీ ఆధార్ కార్డులు, గది రిజిస్ట్రేషన్ స్లిప్, రూ.800లు నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. రంజిత్ అనే దళారి ఒక్కో గదికి రూ.వెయ్యి లెక్కన ఇస్తామని తనను నియమించుకున్నట్లు ఆషిక్ విచారణలో వెల్లడించాడు. నకిలీ గుర్తింపు పత్రాలతో గదులు పొందడం, వాటిని దళారికి అప్పగించడం తన పని అని, ఆ గదులను భక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపాడు. ముఠాలోని ఇతర సభ్యులపై విచారణ కొనసాగుతోంది. విజిలెన్స్ విభాగం ఫిర్యాదు మేరకు తిరుమల2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఈ ఘటనపై నమోదు చేశారు. నకిలీ ఆధార్ కార్డుల ప్రామాణికతను నిర్ధారించడంతో పాటు, సాంకేతిక ఆధారంగా ముఠా వ్యవహారాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనుమానాస్పద కదలికలు కనిపించినా వెంటనే టిటిడి విజిలెన్స్ సెక్యూరిటీ కంట్రోల్ రూమ్ నెం 98668 98630 గానీ కాల్ సెంటర్ నెం 155257కు సమాచారం ఇవ్వాలని భక్తులను కోరారు.

